# కథ

# దియా

## "ట్రింగ్..ట్రింగ్...ట్రింగ్..."

## "హలో డా.రేవతి హియర్"

**"రేవతీ! నేను కీర్తనని మాట్లాడుతున్నాను"**

**"ఓఁ కీర్తనా...బాగున్నావా?"**

**"బాగున్నాను. రేవతీ...మూడురోజుల క్రితం నిన్నో విషయం అడిగాను. ఆలోచించి చెబుతానన్నావ్. అదే..నీ జవాబు కోసం ఫోన్ చేస్తున్నాను"**

**కొంతసేపు తికమకపడి..**

ఆ తరువాత తీవ్రంగా ఆలోచించి ''ఆ..ఆ..గుర్తొస్తోంది.అదేదో..'దియా' గురించి కదూ. సారీ...టైమే దొరకలేదు ఆలోచించడానికి. మర్చేపోయాను..అయినా కీర్తనా నీకు తెలుసు కదా. నేను ఓ బిజీ డ్యాక్టర్నని. క్లినిక్..రెండు, మూడు హాస్పిటల్స్‌లో కన్సల్‌టెంట్‌గా వర్క్ చేయడం చాలా టయిర్డ్ అయిపోతున్నానోయ్. బహుశా కుదరదేమో. అయినా ఆలోచిస్తాను''

''సరే..నీకు టైం దొరికినప్పుడే బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వస్తే నాకు ఫోన్ చేయ్..ప్లీజ్...''

''ఓకే..ష్యూర్...బై...సీ...యూ'' అని ఫోన్ పెట్టేసింది డ్యాక్టర్ రేవతి.

కీర్తన మనసంతా నిరాశతో నిండిపోయింది డ్యాక్టర్ రేవతి అలా అనాసక్తిగా, అంత పొడిగా, కేవలం ఒక ఫార్మాలిటీగా మాట్లాడడంతో. అసలు తను చెప్పిన విషయం ఆమెకు గుర్తు కూడా ఉన్నట్లు లేదు. దాని గురించి కనీసం ఆలోచించినట్లు కూడా లేదు. ఇప్పుడు తను ఫోన్ చేయడంతో అతికష్టం మీద రీకలెక్ట్ చేసుకుని అప్పటికప్పుడు కుదరదేమో అని చెప్పింది. రేవతి ఒక డ్యాక్టర్...పొద్దున లేస్తే రోగాలు, బాధలు, మూల్గులు, కేకలు. వీటి మధ్య మసలే మనిషి. కనుక తను చెప్పిన విషయానికి త్వరగా స్పందిస్తుందని వెంటనే తను అడిగిందానికి అంగీకరిస్తుందనీ కోటి ఆశలతో ఎదురు చూస్తూ కూర్చుంది తను ఇక్కడ. మూడు రోజులైనా రేవతి దగ్గర నుండి ఫోన్ రాకపోయేసరికి తనే కుతూహలం ఆపుకోలేక ఫోన్ చేసింది. జవాబు ఇంత చప్పగా, ఇంత నిర్లక్ష్యంగా ఉంటుందని అనుకోలేదు.

'దియా' అంటే ఏమిటో కూడా గుర్తులేదు ఆమెకు. 'దియా' గురించి ఒకసారి విన్న తర్వాత ఎవరైనా దాన్ని మర్చిపోగలరా?

తనకు దియాతో పరిచయమై, అందులో తనూ ఒక భాగమై నిన్నటికి సంవత్సరం అయింది.

'ఆనాడు తన ఎనిమిదేళ్ళ కూతురు రక్ష తనకు ప్రేరణను ఇవ్వకపోతే ఈనాటికీ తనకు ఈ తృప్తి, ఈ సంతోషం లభించి ఉండేవి కావేమో' అనుకుంది కీర్తన ఆనాటి సంఘటనను మరోసారి గుర్తు చేసుకుంటూ.

★ ★ ★

చైల్డ్ సైకాలజిస్టుగా మంచి పేరుంది కీర్తనకు. అన్నిరకాల వయసు పిల్లలను వింత, వింత మనోవ్యాధులతో కీర్తన దగ్గరికి తీసుకొస్తుంటారు వాళ్ళ తల్లిదండ్రులు.

తెలిసీ తెలియని వయసు, ఎదిగీ ఎదగని మనసు. వీటిపై బలంగా తమ ప్రభావాన్ని చూపించే ఇంటి పరిస్థితులు, బయటి వాతావరణం... వాళ్ళను ఎన్నో డిప్రెషన్స్‌కు, ఎంతో మనోవ్యాకులతకు గురి చేస్తుంటాయి. ఎంతో నైపుణ్యంతో, మాటలగారడీతో అవేమిటో తెలుసుకుని 'ముళ్ళమీద పడ్డ గుడ్డ' సామెతలా పిల్లల మనసును యథాస్థితికి తీసుకుని రావలసి వస్తుంది. అది ఎంతో శ్రద్ధాసక్తులతో చేయాల్సిన బాధ్యతాయుతమైన పని, కీర్తనకు తన వృత్తిపట్ల తనకు గౌరవం ఉంది. ఇష్టం ఉంది. తన దగ్గరికి తేబడిన ప్రతి పిల్లను, పిల్లవాడిని తన పిల్లలుగా ప్రేమించగల అమ్మ మనసు ఆమెలో ఉంది. అందుకే చేపట్టిన ప్రతి కేసూ ఇంతవరకూ సక్సెస్ అవుతూనే వస్తోంది. 'ఈ తృప్తి ఈ ఆనందం చాలు ఈ జన్మకు..' అనుకుంటూ అలసిపోయి ఇంటికి వచ్చి రిలాక్సింగ్‌గా ఈజీ చెయిర్‌లో కూర్చుంటుంది కీర్తనరోజూ. ఆరోజు అలాగే కూర్చుంది.

'ఈ తృప్తి చాలదు. ఈ ఆనందం ఒక లెక్కలోనిది కాదు. నువ్వు చెయ్యవలసింది ఇంకా చాలా ఉంది' అన్నట్లుగా ఆరోజు ఒక చిన్న సంఘటన జరిగింది.

కీర్తన కుర్చీలో కూర్చుని టీవీ చూస్తోంది. పక్కనే చేతిలో పుస్తకాలతో రక్ష కూర్చుని హోం వర్క్ చేసుకుంటోంది.

ఆరోజు ఎయిడ్స్ డే.

టీవీలో ఎయిడ్స్ గురించీ, అది రావడానికిగల కారణాల గురించీ, నివారణోపాయాల గురించీ డాక్యుమెంటరీ ఏదో వస్తోంది. అది చూస్తూ రక్ష చకచకా ఏదో రాయడం చూసి ''ఏం రాస్తున్నావే నువ్వు?'' అని అడిగింది కీర్తన.

''ఈరోజు ఎయిడ్స్ డే కదా మమ్మీ. మా టీచర్ దీని గురించి ఒక ఎస్సే రాసుకొచ్చి రేపు చూపించమంది. తను కొన్ని పాయింట్స్ ఇచ్చారు. అయినా ఇప్పుడు అనుకోకుండా ఆ ప్రోగ్రామ్స్ వస్తుంటే మరికొంత మేటర్ రాసుకుంటున్నాను'' అంది రక్ష.

దాని మాటలతో నాకూ ఆసక్తి పెరిగి టీవీ స్క్రీన్‌కు కళ్ళప్పగించి చూస్తూండిపోయాను. కొంతసేపటికి కళ్ళే కాదు మనసు కూడా అర్పించాల్సి వచ్చింది బుల్లితెరకు.

బోలారంలో ఉన్న దియా గురించి చెబుతున్నారు. ఎయిడ్స్ పేషెంట్ల కోసం నెలకొల్పబడిన ఒక సేవా సంస్థ ఫ్రీడమ్ ఫౌండేషన్‌లో 'దియా' ఒక పిల్లల విభాగం.

తల్లి కడుపులో ఉండగానే హెచ్.ఐ.వి. పాజిటివ్‌కు గురై పెద్దలు చేసిన తప్పులకు శిక్ష అనుభవిస్తున్న చిన్నారులు, అక్కడ ఎందరో ఉన్నారు. నాలుగురోజుల పసిగుడ్డు నుంచి, తొమ్మిది సంవత్సరాల ఎదిగిన పిల్లల వరకూ అక్కడ చికిత్స పొందుతున్నారు. ఎప్పుడు ఆరిపోతాయో తెలియని కొడగట్టిన ఆ దీపాలు. తమకేమయిందో తెలియని అమాయకత్వంతో అక్కడ అనాథలుగా కాలం గడుపుతున్నారు. భయంకరమైన ఆ వ్యాధికి భయపడి కొందరు, సమాజంలో ఎదుర్కోబోయే చిన్నచూపునకు వెరచి మరికొందరు పొత్తిళ్ళలోని పిల్లలను 'దియా' ఇంటి ముందు వదిలేసిపోయారు. మరికొంతమంది కని హాస్పిటల్‌లో వదిలేసిపోయారు. ఒక పక్క ఒంటరితనం, మరో ప్రక్క వ్యాధి బాధ కృంగదీస్తున్న ఆ పిల్లలు జాలి ముఖాలతో, కొందరు అన్నెం పున్నెం ఎరుగని చిరునవ్వులు, అమాయకపు బాల్యచేష్టలతో మరికొందరు టీవీ స్క్రీన్‌మీద కనిపించగానే కీర్తన హృదయం ద్రవించిపోయింది. ఎయిడ్స్ గురించి అవగాహన ఉందిగానీ అంతమంది 'దియా' అనే ఒక సేవాసంస్థ వెలుగులో సేదతీరుతున్నారని ఆమెకు తెలీదు. మనసులోనే ఆ సంస్థను మెచ్చుకుంటూ, రక్ష ఏం చేస్తోందనని పక్కకి తిరిగి చూసింది కీర్తన. చేతిలోని పెన్నును అలాగే పట్టుకుని కళ్ళూ, చెవులూ టీవీకి అప్పగించి అలాగే ఉండిపోయిన రక్షను ఆశ్చర్యంగా చూసింది కీర్తన.

ఆ ప్రోగ్రామ్ అయిపోయింది కొద్దిసేపటికి.

బరువెక్కిన గుండెలతో కొంతసేపు కీర్తన, రక్ష

నిశ్శబ్దంగా ఉండిపోయారు. ఉన్నట్టుండి రక్ష ''మమ్మీ నేను దియాకు వెళ్తాను. వెళ్ళనా?'' అంది.

ఆశ్చర్యంతో అదిరిపోయింది కీర్తన.

''నువ్వు దియాకు వెళ్లడం ఏమిటి?'' అంది అయోమయంగా.

''పాపం అక్కడి పిల్లల్ని చూస్తుంటే జాలేస్తుంది మమ్మీ. వాళ్లకు మమ్మీ లేదు, డాడీ లేడు. బ్రదర్స్, సిస్టర్స్ ఎవ్వరూ లేరు. ఎంతో లోన్లీగా, ఏదో పోగొట్టుకున్నట్లుగా ఎంత విచారంగా కన్పిస్తున్నారు వాళ్ళు స్క్రీన్‌మీద. నేను వెళ్ళి వాళ్లతో ఫ్రెండ్‌షిప్ చేసుకుంటాను. వాళ్లతో ఆడుకుంటాను. వాళ్ళతో కలిసి పాటలు పాడుకుంటాను. నేను అలాచేస్తే వాళ్ళు చాలా హేపీగా ఫీలవుతారు కదూ'' అంది రక్ష ఉత్సాహంగా.

ఆ సమయంలో కీర్తనకు అనిపించింది 'నా ఎంఏ సైకాలజీ డిగ్రీ, నా పిహెచ్‌డీ పట్టా...ఎందుకు? కాల్చనా...ఒక చిన్న పిల్లకు తెలిసినపాటి చైల్డ్ సైకాలజీ నాకు తెలియనప్పుడు' అని ఆగ్రహావేశాలతో తనను తాను నిందించుకుంది.

తన తెలివితక్కువతనానికి తనే సిగ్గుపడింది.

తన కడుపున పుట్టిన తన కూతురి తెలివితేటలకు, ఆలోచనాశక్తికి, సహృదయకు అబ్బురపడింది, ఆనందించింది.

ఆ ఆనందోత్సాహాలతోనే ''తప్పకుండా వెళ్దువుగానీ రక్షా. నీతో నేను కూడా వస్తాను. అక్కడ నీతోపాటే నా అవసరమూ ఉంది ఒక సైకాలజిస్టుగా. మనం చేయగలిగింది చేద్దాం. ఇంకొంత కాలం మాత్రమే ఈ ప్రపంచంలో ఉండగలిగిన ఆ పిల్లలకు చివరి రోజుల్లోనైనా ఆనందాన్ని, ఉత్సాహాన్ని పంచి పెడదాం'' అంది. మెరిసే కళ్లతో తల్లి వంక చూసింది రక్ష.

★ ★ ★

కీర్తన, రక్ష వచ్చేసరికి కౌశిక్ డ్రాయింగ్‌రూంలో కూర్చుని మెడికల్ జర్నల్ ఏదో చదువుతూ కనిపించాడు.

తలుపు తీసిన శబ్దానికి తలెత్తి చూసి ''తల్లీబిడ్డలిద్దరూ ఎక్కడికి వెళ్ళి వస్తున్నారు?'' అని అడిగాడు.

''దియాకు వెళ్ళివస్తున్నాం'' అంది కీర్తన.

''అదేంటి..హిందీ పిక్చరా?''

'సిటీలో ఉంటూ దియా అనే సంస్థ ఒకటి ఇక్కడ ఉన్నదన్న విషయమే తెలియదు మనకు. మొన్న డాక్టర్ రేవతి కూడా ఇలాగే అడిగింది. దియా అంటే అది ఏదైనా హాస్పిటలా?' అని అనుకుంది కీర్తన.

భర్త అడిగిన ప్రశ్నకు సమాధానంగా దియా గురించి వివరంగా చెప్పింది.






''అక్కడ పిల్లల్ని చూస్తుంటే గుండె తరుక్కుపోతుందండీ. తమకొచ్చిన జబ్బేమిటో తమకే తెలియని పసితనం కొందరిది, ఇంకొద్ది రోజుల్లో ఈ లోకాన్ని వదిలి పెట్టి పోబోతున్నామన్న విషయం తెలియక ఆడుతూ, పాడుతూ, గంతులేసే బాల్యచేష్టలు కొందరివి..ఎంత జాలేస్తోందో వాళ్ళను చూస్తుంటే. కొంతమంది పిల్లలయితే అడ్వాన్స్ స్టేజ్‌లో మంచాలకి అంటుకునిపోయి నరకయాతన పడుతున్నారు'' అంది కీర్తన బాధగా.

''పాపం!'' అన్నాడు కౌశిక్ సానుభూతిగా.

''నిజంగా దియాను మెచ్చుకోవాలి. అక్కడ నా వాళ్లంటూ ఎవరూ లేని అనాథబాలలను, తల్లిదండ్రులు నిర్దయంగా వదిలేసిన పిల్లలను దగ్గరకు తీసుకుని ఎన్నో విధాల వాళ్లకి సేవలందిస్తున్నారు. ఎయిడ్స్ సోకిన పిల్లలను ఏ హాస్పిటల్‌లోనూ చేర్చుకోరట సామాన్యంగా...''

''స్కూల్లో కూడా చేర్చుకోరట డాడీ.'' అంది రక్ష మధ్యలో అడ్డుకుంటూ. అప్పుడు ఆ చిన్నారి కంఠంలో తొణికిసలాడిన ఉద్వేగం, జాలి చూసి కీర్తన, కౌశిక్ ఇద్దరూ ఒకేసారి రక్షవంక చూశారు. చిన్నబోయినట్లున్న ఆ ముఖం చూసి దియా రక్షను బాగా కదిలించిందని అర్థం చేసుకున్నారు.

''మమ్మీ...గీత అన్న అమ్మాయి నాకు బాగా క్లోజ్‌ఫ్రెండ్ అయింది తెల్సా. నేను వస్తుంటే 'మళ్లీ ఎప్పుడొస్తావ్?' అని అడిగింది..'' అంది రక్ష.

''నువ్వెళ్ళి ఏం చేసావమ్మా అక్కడ?'' అని కుతూహలంగా ప్రశ్నించాడు కౌశిక్.

''నేను వెళ్తూ బోలెడు చాక్లెట్లు, బిస్కెట్లు తీసుకెళ్లాను. అవన్నీ అక్కడ అందరికీ పంచిపెట్టాను. అందరి పేర్లూ అడిగి తెలుసుకున్నాను. నా ఈడు పిల్లలతో కలిసి ఆడుకున్నాను. అందరికీ రైమ్స్ వినిపించాను. స్టోరీస్ చెప్పాను. సంధ్య అన్న అమ్మాయి అడిగింది 'నువ్వు రోజూ స్కూల్‌కి వెళతావా?' అని 'వెళతాను' అని చెబితే 'నాకు

డా. కొఠారి వాణీచలపతిరావు

స్కూలుకి వెళ్లడం అంటే ఎంత ఇష్టమో, కానీ మమ్మల్ని స్కూలుకి రానివ్వరట కదా' అంది. నీలిమ అనే అమ్మాయి 'ఆవిడ మీ అమ్మనా. మీ అమ్మ చాలా బాగుంది. నీకు నాన్న కూడా ఉన్నారా? ఉంటే ఈసారి నాకు చూపిస్తావా. నాకు అమ్మ, నాన్న ఎవ్వరూ లేరు' అంది. ఆ అమ్మాయిని చూస్తుంటే పాపం అనిపించింది డాడీ'' అంది రక్ష కళ్ళల్లో గిర్రున తిరిగిన కన్నీటితో.

రక్ష లోపలికి వెళ్ళాక కౌశిక్ భార్యతో అన్నాడు ''నువ్వు రక్షను తీసుకెళ్ళకుండా ఉండాల్సింది. చిన్నపిల్ల. ఎదిగీ ఎదుగుతున్న మనసు మీద ఇలాంటివి భారమవుతాయేమో'' అని.

కీర్తన ఆయన మాటలను అంగీకరించలేదు.

''మీ అభిప్రాయం తప్పు. ఎందుకంటే రేపటి పౌరులను సామాజిక సమస్యల నుంచి దూరంగా ఉంచాలనుకోవడం తల్లిదండ్రులుగా మనస్వార్థాన్ని, సంకుచితత్వాన్ని తెలియజేస్తుంది. సేవాభావం, బాధ్యతాయుత ప్రవర్తన అనేవి చిన్నతనం నుంచీ అలవాటు కాకపోతే పిల్లలు పెద్దయిన తర్వాత వాళ్ళలో కేవలం 'నా ఇల్లు, నా సంసారం' అన్న చట్రంలో తమను తాము బంధింపచేసుకునే పరిమిత మనస్తత్వం అలవడుతుంది. అయినా ఒక ముఖ్య విషయం ఏమిటంటే రక్షను ఈరోజు దియాకు నేను తీసుకెళ్ళలేదు. అదే నన్ను తీసుకెళ్ళింది. కొన్ని కొన్ని విషయాలకు పిల్లలు స్పందించినంత త్వరగా మనం స్పందించలేమని ఇవ్వాళ దాన్ని చూసి నేను నేర్చుకున్నాను. దానంత ఎత్తు ఎదగలేకపోయినందుకు ఓ నిముషం సిగ్గుపడ్డాను కూడా'' అంది కీర్తన.

ఆలోచనలో పడ్డాడు కౌశిక్. అతని మనసూ కొంత బరువెక్కింది ఆ మాటలతో. వాతావరణాన్ని తేలిక పరచడంకోసం అన్నట్లు-

''కీర్తనా... అన్నం పెట్టరాదూ... ఆకలేస్తోంది'' అన్నాడు.

టేబుల్ మీద అన్నీ అరేంజ్ చేసింది కీర్తన.

''రక్షా! అన్నానికి రామ్మా'' అని పిలిచింది.

''నాకు ఆకలిగా లేదు మమ్మీ'' అంది రక్ష బయటికి వచ్చి పుస్తకాలు తీసుకుంటూ.

రక్షకు ఆకలి ఎందుకు లేదో అర్థమైంది కీర్తనకు.

''ప్లేట్లో పెట్టేశాను రావాలి. మధ్యాహ్నం ఎప్పుడో తిన్నావు''

''రక్షా భోజనానికి రా. వేళకు భోజనం చేయాలని నీకు ఎన్నిసార్లు చెప్పాను'' అన్నాడు కౌశిక్.

అతను న్యూట్రిషియనిస్టు. అందుకే ఆహార నియమాలు బయటే కాదు ఇంట్లోనూ బోధిస్తుంటాడు.

''వట్టి మజ్జిగన్నం తింటాను'' అంటూ వచ్చి టేబుల్ ముందు కూర్చుంది రక్ష.

''రక్షా నీకేం చెప్పాను. పది నుండి 18 ఏళ్ళ లోపు పిల్లలకు 1800 నుండి 2000 కేలరీల శక్తిగల ఆహారం రోజుకి కావాలి. అందులో విటమిన్లు, కాల్షియం, మాంసకృతులు, ఐరన్ అన్నీ సమపాళ్ళలో ఉండేలా చూసుకోవాలి. నువ్వు మ్యాథ్స్ సబ్జెక్టుకు ఎక్కువగా చదివితే కేవలం మ్యాథ్స్‌లోనే మంచి మార్కులు వస్తాయి గానీ ఇతర సబ్జెక్టులలో రావు కదా. ఇదీ అలాగే. నువ్వు ఒక్క మజ్జిగన్నం తింటే కొవ్వు పదార్థం తప్ప ఇతర పౌష్టిక విలువలు లభించవు కదా. కనుక అన్ని పదార్థాలూ నువ్వు సమంగా తినాలి. అంతా ఒకేసారి ఎక్కువగా కాక కొద్దికొద్దిగా రోజుకు మూడు, నాలుగుసార్లు తీసుకుంటే మెదడు చురుగ్గా పనిచేస్తుంది'' అంటూ కూతురికి ఉత్సాహంతో ఆహార నియమాలు చెబుతున్నాడు కౌశిక్.

రక్ష మారుమాట్లాడకుండా ఆకుకూర పప్పు కూర కలుపుకుంది.

అన్నం కలుపుతూనే తండ్రి మాటలను శ్రద్ధగా విని, ఆ తరువాత ఏదో దీర్ఘంగా ఆలోచించి ఉన్నట్టుండి అంది రక్ష.

''డాడీ..మీరు కూడా దియాకు ఎందుకు రాకూడదు రేపటినుంచీ''

చటుక్కున తలెత్తి చూసింది కీర్తన చేతిలో ముద్ద చేతిలో ఉండగానే.

''నేనెందుకు?'' అయోమయంగా అన్నాడు కౌశిక్.

''మీరు న్యూట్రిషియనిస్టు కదా. అక్కడి పిల్లలకు తక్కువ క్వాంటిటీలో ఎక్కువ ప్రొటీన్లు ఉన్న ఆహారాన్ని సజెస్ట్ చేయడానికి. ఈ డిసీజ్‌తో బాధపడుతున్న ఆ పిల్లలకు అన్నం తినబుద్ధికాదట. బాధతో యాతనపడుతున్న వాళ్లకు తిండి మీదకు ధ్యాసపోదని అక్కడ ఒక ఆయా అంది. అందుకే వాళ్ళు ఎండుకపోయి పుల్లలా చాలా వీక్‌గా ఉన్నారు. అలాంటివాళ్లకు న్యూట్రిషియన్ సేవలు అవసరం కాదంటారా డాడీ'' అంది రక్ష.

''వెరీ గుడ్ ఐడియా!'' అంది కీర్తన తన ఉత్సాహంలోనే ఆనందం వ్యక్తమవుతుండగా.

''నిజమే'' అన్నాడు కౌశిక్ సాలోచనగా.

''ఇలా ఒకళ్లకొకళ్ళం అనుకుని అందరం ముందుకొస్తే ఎయిడ్స్ బాధితులైన ఆ పిల్లలకు సేవచేస్తున్నామన్న తృప్తి, సంతోషమే కాక దియా వంటి మరికొన్ని సంస్థలు వెలిసే అవకాశం ఉంది. ప్రజల్లోనూ అవగాహన పెరిగి ఇలాంటి పిల్లలకు వారు సామాజిక జీవితాన్ని అందిచ్చే అవకాశం ఉంది'' అంది కీర్తన.

''సరే... రేపటి నుంచీ నేను కూడా

## మార్గదర్శి

**సొట్టబుగ్గల సుందరి ప్రీతీజింతా తనకిష్టం లేని పాత్రల్ని మొహమాటం లేకుండా తిరస్కరిస్తుందిట. ఆ విషయం గురించి ఆమెని అడిగితే 'నా వ్యక్తిత్వం నా భావితరాలకు మార్గదర్శకం కావాలి. నా గురించి పదిమందీ మంచిగా చెప్పుకోవాలి. అందుకోసం కొన్నిసార్లు ఎన్ని ఇబ్బందులనైనా అవలీలగా ఎదుర్కోవడానికి నేనెప్పుడూ సిద్ధమే' అని చెబుతోంది. సినిమాల్లో హింసా ప్రవృత్తి, అశ్లీలానికి నేనెప్పుడూ వ్యతిరేకమే. అలాంటివి నా కంటపడినప్పుడు ఎలాంటి రాజీధోరణి లేకుండా దర్శకుల వైఖరి మార్చడానికి ప్రయత్నం చేస్తాను' అని చెబుతోంది. క్రమేపీ విలువలు పతనమవుతున్న ఈరోజుల్లో ఇలాంటి నియమబద్ధమైన జీవితం కష్టమే.**



వస్తాను. నాకు కూడా ఉత్సాహంగానే ఉంది'' అన్నాడు కౌశిక్.

''మా ఫ్రెండ్ డాక్టర్ రేవతి ఉంది. అది మంచి ఫిజీషియన్. దాన్ని కూడా అడుగుతాను నీ బిజీ షెడ్యూల్‌లో ఏ కొంచెం టైం అయినా ఆ పిల్లలకు కేటాయించమని'' అంది కీర్తన.

అలా ఆ రోజు డాక్టర్ రేవతిని కీర్తన దియా విషయమై సంప్రదించింది. ఒక దీపం నుండి మరో దీపం వెలగగలిగితే అంధకారంతో నిండిపోయిన ఆ చిన్నారి జీవితాల్లో చిరుకాంతులనైనా చిందించగలమేమో అన్న ఆశ కీర్తనతో అలా చేయించింది.

★ ★ ★

డాక్టర్ రేవతి క్లినిక్‌లో బిజీగా ఉంది.

ముప్ఫయిమంది వరకూ ఉన్న పేషెంట్స్ ఒకరి తర్వాత ఒకరిగా టోకెన్లు చేతిలో పట్టుకుని లోపలకి వస్తున్నారు.

తనకు అసిస్ట్ చేయడానికి నియమించుకున్న ఇద్దరు నర్సులు వచ్చిన వాళ్లకు వచ్చినట్లుగా వెయిట్, బిపి, టెంపరేచర్ చెకప్ చేస్తున్నారు. ఇరవై ఎనిమిదో నెంబర్ తాలూకు పేషెంట్ లోపలకి వచ్చింది. ఇంతలో టెలిఫోన్ మ్రోగింది.

''హలో డాక్టర్ రేవతి హియర్''

''అత్తయ్యా! నేను గౌరిని మాట్లాడుతున్నాను''

''ఓ! గౌరీ ఎక్కడి నుంచి?''

''ఇక్కడినుంచే అత్తయ్యా. మీ ఇంటినుంచే గంటక్రితమే వచ్చాం. అమ్మ కూడా వచ్చింది. నువ్వెప్పుడు వస్తావో అడుగుదామని చేశాను''

''ఇప్పుడే...ఓ అరగంటలో వస్తాను. మరో ఇద్దరు పేషెంట్లు మాత్రమే ఉన్నారు. ఓకే?'' అంటూ ఫోన్ పెట్టేసింది రేవతి.

గౌరి వచ్చిందనగానే చాలా సంతోషం కలిగింది రేవతికి.

ఎప్పుడెప్పుడు ఇంటికి వెళ్దామా అన్నట్లు అనిపించింది.

గౌరి రేవతి పెద్దన్న కూతురు.

ముగ్గురన్నల ముద్దుల చెల్లి అయిన రేవతికి గౌరి ముద్దుల మేనకోడలు.

రేవతి పదేళ్ళ పిల్లగా ఉన్నప్పుడు గౌరి పుట్టింది ఆ ఇంట.

అందువల్ల వరుసకు మేనత్త అయినా అక్కలా ఆ పిల్లను భుజాన వేసుకుని ఎత్తుకు తిరిగింది. చిటికెనవేలు ఆసరా ఇచ్చి అడుగులు వేయించింది. స్నానం చేయించి, చొక్కా తొడిగి, జడలు వేసి, పూలుపెట్టి రోజుకోరకంగా అలంకరించేది. ఇద్దరూ కలిసి ఆడుకునేవాళ్ళు, పాడుకునేవాళ్ళు, పోట్లాడుకునేవాళ్ళు. దాంతో గౌరి కాస్త పెరిగి పెద్దయినాక వాళ్ళ మధ్య స్నేహబంధంలాంటిది కూడా ఏర్పడింది.

రేవతి మెడిసిన్ చదవడానికి హైదరాబాద్ వెళ్ళినప్పుడు ఒంటరితనంతో ఇల్లంతా తిరుగుతూ పిచ్చిదానిలా మారిపోయింది గౌరి.

పెళ్ళయి భర్తతో అత్తవారింటికి వెళుతున్నప్పుడు గౌరి పెళ్లివారి కారు వెనకబడి నేనూ వస్తానని వెక్కివెక్కి ఏడిస్తే చూసి తట్టుకోలేక తన వెంట ఆ పిల్లనూ మూడునిద్రలకు తీసుకెళ్లింది రేవతి.

వాళ్లిద్దరి మధ్యా మేనత్తా మేనకోడలిని మించిన మరెన్నో బంధాలు వున్నాయి. అందుకే అత్త దగ్గరికి రావడం అంటే ఆనందంతో గంతులు వేస్తుంది గౌరి. కోడలు వచ్చిందనగానే ప్రాణం లేచి వస్తుంది రేవతికి.

కారు వేగంగా వచ్చి పోర్టికోలో ఆగగానే ''అత్తయ్యా!'' అంటూ ఛెంగుఛెంగున లేడిలా గంతులేస్తూ పరుగెత్తుకుంటూ వచ్చింది గౌరి.

''గౌరీ'' అంటూ తనని అక్కున చేర్చుకుని ఆప్యాయంగా నుదురు చుంబించింది రేవతి.

లోపలకి వెళ్ళి టీవీ చూస్తూ సోఫాలో కూర్చున్న అలివేలును ఉద్దేశించి ''బాగున్నావా వదినా? అన్నయ్య ఎలా ఉన్నాడు? తను కూడా రావొచ్చు కదా?'' అని కుశలప్రశ్నలు వేసింది.

''మీ అన్నయ్యకు ఆ వ్యవసాయం పనుల నుంచి తీరిక దొరికితే కదా. అందులోనూ ఇప్పుడు పంట ఇంటికి వచ్చే రోజులు కదా. నువ్వయినా అప్పుడప్పుడూ వస్తావనుకుంటే నీకూ హాస్పిటల్, పేషెంట్లు అంటూ క్షణం తీరదు. మీ అన్నాచెల్లెళ్ళూ...ఇక కలిసేదెప్పుడు?'' అంది అలివేలు.

చిరునవ్వు నవ్వి ఊరుకుంది రేవతి.

## రీమాకి మరో హిట్

వరుస హిట్‌లతో టాలీవుడ్ నిర్మాత, దర్శకుల దృష్టిని ఆకర్షించిన నటుడు రవితేజ. ఇప్పుడతనితో సినిమా తీయడానికి ఎంతోమంది నిర్మాత, దర్శకులు ఆసక్తి కనబరుస్తున్నారు. తాజాగా ఎస్.రమేష్‌బాబు నిర్మాతగా రవిరాజా పినిశెట్టి దర్శకుడిగా రూపొందుతున్న 'వీడే..' చిత్రం షూటింగ్ సగం పూర్తయింది. ఒరిజినల్ చిత్రంలాగే ఈ సినిమా కూడా మంచి హిట్ అవుతుందన్న నమ్మకంతో ఉన్నారు నిర్మాత, దర్శకులు. హైదరాబాద్‌లో భారీ షెడ్యూల్ షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రంలో రవితేజకి జంటగా రీమాసేన్ నటిస్తోంది.



''మీ ఆయనా ఊళ్ళో లేరటగా?'' అడిగింది అలివేలు.

''లేరు. కాన్ఫరెన్స్ ఉంటే బాంబే వెళ్ళారు. వారం రోజులు పడుతుంది వచ్చేసరికి''

గౌరి కిచెన్‌లోకి వెళ్ళింది అత్తయ్యకు టీ తయారుచేసి తెచ్చే ఉద్దేశంతో.

''రేవతీ! ఈమధ్య గౌరికి తరచూ జ్వరం వస్తోంది. తగ్గినట్టే తగ్గి మాటిమాటికీ వస్తోంది. మన ఊళ్ళో ఉన్న ఆర్.యం.పి. డాక్టరే ఏవేవో మాత్రలు ఇస్తున్నాడు. ఒకసారి నీకు చూపిద్దామని తీసుకొచ్చాను''

''అలాగా. ఇన్నిరోజులు ఎందుకున్నారు మరి? మీకు కుదరకపోతే నాకు ఫోన్ చేస్తే వీలు చూసుకుని ఒక పూట కోసమైనా నేనే వచ్చేదాన్ని కదా?'' అంది రేవతి.

''మామూలు జ్వరానికి నిన్నెందుకు డిస్టర్బ్ చేయడం. మన ఊళ్ళో డాక్టర్ కూడా మంచిగానే చూస్తాడు'' అంది అలివేలు.

టీ కప్పులతో వచ్చిన గౌరిని దగ్గర కూర్చోపెట్టుకుని పరీక్ష చేసింది రేవతి. జ్వరలక్షణాలు అడిగి తెలుసుకుంది. ''ఏం లేదులే. మామూలు జ్వరమే. కోర్సు వాడితే జ్వరం మళ్ళీ మళ్ళీ రాకుండా పూర్తిగా తగ్గిపోతుంది. టెంపరేచర్ ఉన్నప్పుడు ఏ క్రోసిన్, కాల్పాలో మాత్రమే వాడి ఉంటారు గౌరీ. రేపు నేను హాస్పిటల్‌కి వెళ్ళేటప్పుడు నువ్వు కూడా నాతో రా! ఏ జ్వరమో తెలుసుకోవడం కోసం ల్యాబ్‌లో చెప్పి నీకు బ్లడ్‌టెస్ట్ చేయిస్తాను'' అంది రేవతి.

''అలాగే అత్తయ్యా'' అంది గౌరి.

ఆ రాత్రి ఇద్దరూ ఒక పక్కలో పడుకుని ఎన్నెన్నో కబుర్లు చెప్పుకున్నారు. ఉదయమే గౌరిని తన వెంట హాస్పిటల్‌కి తీసుకెళ్ళింది రేవతి.

ల్యాబ్ టెక్నీషియన్స్‌కి చెప్పి గౌరికి బ్లడ్ టెస్ట్ చేయించింది.

సాయంత్రం ఆరుగంటలకి ల్యాబ్ నించి ఫోన్ వచ్చింది.

''డాక్టర్ రేవతీ నేను ల్యాబ్‌నుండి డాక్టర్ శ్యామ్‌సుందర్‌ని మాట్లాడుతున్నాను''

''ఆఁ..చెప్పండి...శ్యామ్‌సుందర్''

''మేడమ్. ఎలా చెప్పాలో అర్థం కావడంలేదు. మీరు ఉదయం తీసుకొచ్చిన పేషెంట్ మీ రిలేటివ్ అని చెప్పారు. మిస్ గౌరి ఆ అమ్మాయి బ్లడ్ శాంపిల్ టెస్ట్ చేస్తుంటే...''

''ఆఁ..చేస్తుంటే''

''అయామ్ సారీ టు సే. హెచ్.ఐ.వీ పాజిటివ్ వచ్చింది''

''వ్హాట్'' రూం దద్దరిల్లేలా కేకపెట్టింది రేవతి.


''నిజం మేడమ్''

''నో! ఇది అబద్ధం! మీరు సరిగా చూసి ఉండరు. లేకుంటే పొరపాటున ఎవరి బ్లడ్ శాంపిలో...''

''నెవ్వర్ మేడమ్. ఈ ల్యాబ్‌లో అలాంటి పొరపాట్లు జరగవు. ఆ విషయం మీకూ తెలుసు. ఏదో షాక్‌లో మీరు అలా...''

ఫోన్ టక్కున పెట్టేసింది రేవతి. ఆమెకంతా అయోమయంగా ఉంది.

'డాక్టర్ శ్యామ్‌సుందర్ రిపోర్ట్ తప్పు' అని అనిపిస్తోంది ఒక పక్కన. 'అలాకాదు. ఇంతవరకూ అలా జరగలేదు' అని నిజం వచ్చి నిటారుగా కళ్ళముందు నిల్చుంటోంది మరో ప్రక్కన.



పిచ్చెక్కినట్లుగా ఉంది రేవతికి. ఏం చేయాలో, ఈ నిజాల్ని ఎలా భరించాలో ఈ విషయం తెలిస్తే వదిన, అన్నయ్య, గౌరిల పరిస్థితి ఎలా ఉంటుందో తలుచుకుంటే భయం వేస్తోంది. ఈ విషయం చెప్పాలా? వద్దా? చెప్పినా అవగాహన లేకపోవడం వల్ల వాళ్లకు మొదట అర్థంకాదు. తనే వివరించి చెప్పాల్సి వస్తుంది. ఇంత భయంకరమైన వ్యాధి గురించి విని... అది తమ బిడ్డకే వచ్చిందని తెలిసి తట్టుకోగలరావాళ్ళు. అసలు గౌరికి ఇది ఎలా వచ్చింది? ఈ హెచ్.ఐ.వి వైరస్ ఆమెలో ఎలా ప్రవేశించింది? తనకు తెలిసినంతవరకూ బ్లడ్ ట్రాన్స్‌ప్లంటేషన్ గౌరికి ఎప్పుడూ జరగలేదు. అలాంటి అవసరం వస్తే ఇక్కడికి తన దగ్గరికే తీసుకొస్తారు గానీ ఆ పల్లెటూరిలో అయ్యేపనికాదు. నీడిల్స్, మూలంగా... అన్న ఆలోచన రాగానే చేస్తున్న పని ఆపి కారుడ్రైవ్ చేస్తూ చకచకగా ఇంటికెళ్ళింది రేవతి.

వెళ్తూనే ''గౌరీ...ఇలారా...'' అని ఇంట్లోని కన్‌సల్‌టేషన్ రూంలోకి పిలిచింది.

''ఏంటత్తయ్యా?'' అంటూ వచ్చింది గౌరి.

ముద్దబంతిపువ్వులా ముద్దులొలికే ఆ ముఖంలోని అమాయకత్వానికి కరిగిపోయింది రేవతి. మేనకోడలి ముఖం వైపు చూస్తుంటే ఆమెకు దుఃఖం ఆగడంలేదు.

''గౌరీ..మన ఊళ్ళో ఆ ఆర్‌యంపి డాక్టర్ దగ్గర నువ్వెప్పుడైనా ఇంజెక్షన్స్ చేయించుకున్నావా?''

''ఇంజక్షనా? అమ్మో ఇంజక్షనంటే నాకు చచ్చేంత భయం. ఎప్పుడూ

## గ్లామర్ తార

**బోనీ కపూర్ కొత్త చిత్రం 'బేవఫా' తనకి మంచి బ్రేక్ నిస్తుందన్న ఆశాభావంతో ఉంది శిల్పాశెట్టి సోదరి షమితాశెట్టి. 'ఈ చిత్రం తనకి మంచి పేరుతో పాటు మంచి భవిష్యత్తుని కూడా ఇస్తుంది. గ్లామర్, సెక్సీనెస్, పెర్ఫార్మెన్స్‌కి ప్రాధాన్యం ఉన్న పాత్రతో ప్రేక్షకుల్ని కనువిందుచేయ దానికి సిద్ధమవుతున్నాను' అని చెబుతోంది షమితాశెట్టి. అన్నట్టు ఈమధ్య కొన్ని సంఘటనల వల్ల పత్రికలనించి తప్పించుకు తిరిగిన షమిత ఇప్పుడు ఎంతో హాయిగా ఉంది. గతాన్ని తలుచుకుని కుమిలిపోకుండా భవిష్యత్తుపై ఆశని పెట్టుకుని ముందుకి సాగిపోతోంది. అదే కదా కావాల్సింది?**

టాబ్లెట్లే. అయినా నాకింతవరకూ ఎప్పుడూ డాక్టర్ దగ్గరికి పోవాల్సిన అవసరమే రాలేదు'' పెద్ద పెద్ద కళ్ళను చక్రాల్లా తిప్పుతూ అంది గౌరి.

'ఇంజక్షన్ అంటే భయపడే అమ్మాయికి ఎయిడ్స్ లక్షణాలు' అనుకుంది రేవతి బాధగా.

అంతలోనే మరి ఈ అమ్మాయికి ఈ వ్యాధి ఎలా సోకినట్లు? గౌరి అవివాహిత. ఆలోచిస్తూంటే అంతా పజిల్‌లా ఉంది రేవతికి.

ఏదో అనుమానం క్షణకాలం మనసులో నిలిచి మళ్లీ వెంటనే తప్పుడు ఆలోచన చేసినందుకు ఛ..ఛ అని మనసులో అనుకుంది.

'అయినా తప్పదు. అడగాలి. అది డాక్టర్‌గా తన విధి' అన్న నిర్ణయానికి వచ్చి ''చూడు గౌరీ. నిన్న నీ బ్లడ్ శాంపిల్ టెస్ట్ చేస్తుంటే మా టెక్నీషియన్స్‌కి అందులో ఒక వ్యాధికి సంబంధించిన వైరస్ క్రిములు కనిపించాయట. అది..అది..జనరల్‌గా అందరికీ ఒకే సిరంజితో ఇంజెక్షన్ చేసే సూదుల వల్ల, ఎప్పుడైనా ఏ యాక్సిడెంట్ కారణంగానో వేరే వాళ్ళ రక్తాన్ని పేషెంట్ శరీరంలోకి ఎక్కించడం వల్ల లేక.. లేక ఆ వ్యాధి క్రిములున్న వ్యక్తితో సెక్స్ చేయడం వల్ల వస్తుంది. ఇందులో ఏ కారణమూ నీకు వర్తించదు. కదా. మరి ఈ వ్యాధి నీలో ఎలా సోకిందో అర్థంకావడం లేదు'' అంటూ గౌరి ముఖంలోకి చూసింది రేవతి.

అంతవరకూ శ్రద్ధగా అత్తమాటలు వింటున్న గౌరి ఆ ఆఖరి మాటలకు ఎందుకో బెదిరిపోయినట్లు అనిపించింది. ఎంత దాచుకుందామన్నా దాగని అపరాధ భావమేదో గౌరి వాలిన కళ్ళల్లో ఉండడం గమనించి ఆశ్చర్యపోయింది రేవతి.

''గౌరీ...ఎందుకలా ఉన్నావ్..ఏం జరిగింది? నువ్వేదో దాస్తున్నావ్ కదూ. ఇలా నా కళ్లల్లోకి చూడు. అత్తగా కాక ఒక డాక్టర్‌గా నువ్వు నా దగ్గర ఏదీ దాచకూడదు''

''అత్తయ్యా...'' అంటూ ఉన్నట్టుండి ఆకాశం బద్దలైనట్లు కళ్ళ వెంబడి జలజలా రాలుతున్న కన్నీళ్ళతో పెద్దగా ఏడ్చింది గౌరి.

కూర్చున్నచోట నుంచి లేచి గౌరిని గుండెలకు హత్తుకుంటూ-

''ఏడవకు. ఏం జరిగిందో నాకు చెప్పు. నేనెవరికీ చెప్పను'' అంది.

ఆ లాలనకు కరిగిపోయింది గౌరి. ఆ భరోసా ఆ అమ్మాయికి కొండంత ధైర్యాన్ని ఇచ్చింది.

''అత్తయ్యా! నీకు గుర్తుందా మీ హాస్పిటల్ ప్రారంభం అని అమ్మా, నాన్న ఇక్కడికి వచ్చారు. నేనూ వస్తానని ఎంతగా గొడవపెట్టినా తీసుకురాకుండా నన్నూ, అన్నయ్యనూ ఇంట్లో ఉంచి వచ్చేశారు. ఆరోజు... ఆరోజు...అన్నయ్య ఏదో పని ఉండి బయటికి వెళ్ళిపోయాడు. ఇంట్లో ఒక్కదాన్నే ఉన్నాను. ఓ అరగంట తర్వాత తలుపు చప్పుడైతే అన్నయ్యేనేమో అనుకుని తలుపుతీసాను. కానీ మన ఊళ్ళో ఒక రౌడీగా అందరితో పిలవబడ్డ నాగులు వెకిలినవ్వుతో ఎదుట నిల్చొని కనిపించాడు. భయంతో తలుపేయబోతే రెండు చేతులూ అడ్డం పెట్టి తలుపులు తోసుకుంటూ లోపలికి వచ్చాడు. వస్తూనే నా జబ్బమీద చెయ్యేసి దగ్గరికి తీసుకోబోతుంటే భయంతో కేకలు పెట్టాను. గింజుకున్నాను. కానీ వాడు బలవంతుడు. నేను చిన్నపిల్లను కావడంతో నా శక్తి చాలలేదు.

వాడు రెండు చేతులతో నన్ను మేకపిల్లలా అమాంతం పైకెత్తి మంచం మీద పడేసి...ఆ తరువాత....ఆ తరువాత'' అంటూ భోరున ఏడ్చింది గౌరి.


పరిస్థితి అర్థమైంది రేవతికి. వెక్కిళ్ళమధ్య గౌరి అంది ''అమ్మకు చెప్పాలంటే భయమేసింది. నాన్నకు తెలిస్తే చంపేస్తారని భయమేసింది. అసలే పల్లెటూరు. అందుకే నిందలకు భయపడి నోరు మూసుకుని కూర్చున్నాను. ఒక్కోసారి చచ్చిపోవాలని అనిపించేది. కానీ అందుకూ భయమేసేది''

ఆమె ప్రమేయం లేకుండా జరిగిపోయిన ఆ ఘోరానికి తను మాత్రం ఏమనగలదు? అందుకే మౌనం వహించింది రేవతి.

''గౌరీ బాధపడకు. ఏడ్వకు. కళ్ళు తుడుచుకో. నేనెవ్వరికీ చెప్పనులే'' అని ఊరడించి ఏడుస్తున్న గౌరి కళ్ళు తుడిచి లోపలికి పంపించింది రేవతి.

ఆ తరువాత 'పాపం గౌరి' అని ఎన్నిసార్లు అనుకుందో లెక్కలేదు. 'ఇప్పుడు నేనేం చేయాలి?' అని తనను తాను ప్రశ్నించుకుంది రేవతి. జరిగిపోయిందానికి తనేమీ చేయలేదు. జరగవలసిందే తన చేతుల్లో ఉన్నది. తనకు సాధ్యమైనంత చేయాలి.

గౌరిని తన దగ్గరే ఉంచుకుని ట్రీట్‌మెంట్ ఇప్పించాలి. ఆమె చావును సాధ్యమైనంత దూరం...దూరం...జరుపుతూ ఉన్నన్నాళ్ళూ సంతోషంగా... బాధకీ, యాతనకీ దగ్గర కాకుండా చూడగలగాలి.




ముఖ్యంగా ఎయిడ్స్ రోగి అయిన ఆ నాగులు మరింత మందికి ఈ ఎయిడ్స్ అంటించకుండా, వ్యాప్తి చెందనీయకుండా తగు చర్యలు తీసుకోవాలి.

ఆ తరువాత ఈ ఎయిడ్స్ గురించి ప్రచారం చేసి పల్లె జనంలో సైతం దీని గురించిన అవగాహన కలిగేలా చేయాలి.

తన మేనకోడలిలా అమాయకంగా, తన ప్రమేయం లేకుండా ఎయిడ్స్ బారిన పడిన రోగులకు ఒక డాక్టర్‌గా తన చేతనయిన సేవ తను చేయాలి. డాక్టర్ల నిర్లక్ష్యం వల్ల కొంతమంది, నాన్నల స్వార్థపూరిత అలవాట్ల మూలంగా అమ్మ కడుపులో నుండే ఈ వ్యాధిని వారసత్వంగా తెచ్చుకున్న చిన్నారులు కొంతమంది. ఇలా ఎంతమంది ఉన్నారో ఈ సమాజంలో' అనుకుంది రేవతి బాధగా.

★ ★ ★

''ట్రింగ్... ట్రింగ్... ట్రింగ్..''

''హలో!''

''కీర్తనా...నేను డాక్టర్ రేవతిని''

''రేవతీ..నువ్వా...ఇంత రాత్రివేళ''

''అవును...ఉదయం దాకా ఉండబట్టలేక ఫోన్ చేస్తున్నాను. దియాకు వచ్చి అక్కడి పిల్లలకు వైద్య సేవలు అందించడానికి నేను నా అంగీకారాన్ని తెలియజేద్దామని ఫోన్ చేస్తున్నాను. నువ్వు అడిగినప్పుడు అనాలోచితంగా, ఆ విషయం గురించి శ్రద్ధ చూపించకుండా నో అన్నందుకు నిజంగా నాకు చాలా సిగ్గుగా ఉంది. ఐ యామ్ ఫీలింగ్ గిల్టీ..సారీ...వెరీ వెరీ సారీ''

తన చెవులను తాను నమ్మలేకపోయినట్లయింది రేవతి మాటలు వినగానే కీర్తనకు. ఆనందోద్వేగాలతో ఆమె గొంతు పెగలలేదు.

''చాలా సంతోషం రేవతీ. కొంచెం ఆలస్యంగానైనా నీ బాధ్యతను నువ్వు గుర్తించినందుకు హేపీగా ఉంది. నేను...నువ్వు..మనం...అందరం కల్సి ఈ చిన్నిచిన్ని దీపాలు అంత త్వరగా ఆరిపోకుండా రెండు చేతులూ అడ్డం పెట్టగలిగితే- మనలోని సేవాభావాన్నే ఒక 'దియా'గా మార్చి ఒక దీపంతో మరో దీపం వెలిగించగలిగితే వాళ్లకు జీవితం, మనకు కొంత తృప్తి దొరకుతాయి'' అంది కీర్తన ఉద్వేగంగా.

''ష్యూర్..రేపే మనం అక్కడికి వెళ్దాం'' అంది రేవతి ఫోన్ పెట్టేస్తూ.

ఆ ఫోన్ టాక్ తర్వాత కీర్తనకు ప్రపంచమంతా దివ్వెలమయంగా కనిపించింది.

✤